ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్ జిల్లా వార్తలు
5
ఆదివారం 19 మే 2024



నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టండి

- ప్రజ్ఞ వేసవి శిక్షణ శిబిరం ముగింపులో డీఈఓ జనార్దన్‌రావు



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్ కల్చరల్, మే 18: ప్రతి విద్యార్థి నేర్చుకున్న విలువైన అంశాలను నిత్య జీవితంలో ఆచరణలో పెట్టాలని అప్పుడే శిక్షణకు సార్థకత ఉంటుందని డీఈఓ జనార్దన్‌రావు అన్నారు. వికాసతరంగిణి (127), జెట్ ఆధ్వర్యంలో సప్తగిరికాలనీ కోదండరామాలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రజ్ఞ వేసవి శిక్షణాశిబిరం శని వారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్న జీయరుస్వామి ఆశీస్సులతో ప్రతి యేటా ఈ శిబిరం నిర్వహిస్తుండటం ఒక వరమని అన్నారు.నేర్చుకున్న అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమ తులు ప్రదానం చేశారు. నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినంది ంచారు. కార్యక్రమంలో దుర్శేడ్ గాంధీ పేపర్‌మార్ట్ అధినేత జోగినపల్లి రఘునందన్‌రావు, వికాసతరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు, శ్రీహరిరెడ్డి, ప్రజ్ఞ కో ఆర్డినేటర్ శ్రీదేవి, రాజిరెడ్డి, విద్యార్థుల తల్లిదం డ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇక 'స్థానిక' పోరు



- సన్నద్ధమవుతున్న పార్టీలు
- ఇప్పటికే కార్యాచరణలో బీజేపీ, బీఆర్‌ఎస్
- కౌంటర్ ప్రారంభించిన అధికార కాంగ్రెస్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పార్లమెంట్ ఎన్నికలు పూర్తయి ఫలితాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉండగా రాజకీయపక్షాలన్నీ స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టిసారిస్తు న్నాయి. ఈ సంవత్సరం ముగిసేలోగా గ్రామపంచాయతీ, మండల పరి షత్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తవుతా యని భావిస్తున్నారు. జూలై, ఆగస్టు మాసాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు, అక్టోబర్ నుంచి డిసెంబర్ లోగా మండల, జిల్లా ప్రాదేశిక ఎన్నికలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల కార్యవర్గాల ఎన్నికలు పూర్తవుతాయని భావిస్తున్నారు. దీంతో రాజకీయపక్షాలు పార్లమెంట్ ఎన్నికల వేడి ఆరిపోక ముందే ఎన్నికల వాతావరణాన్ని కొనసాగించే ప్రయత్నాలు చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఈ రాజకీయవాతావరణాన్ని కొనసాగించేందుకు వీలుగా ప్రజాసమస్యలపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గ్రామాల్లో పట్టుసాధించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకుంటూ ఏయే అంశాలను తీసుకొని ప్రజల్లోకి వెళ్లాలని అంతర్గతంగా సమావేశాలు నిర్వహించు కుంటున్నట్లు సమాచారం.

రైతుల సమస్యలపై దృష్టి

రైతాంగ సమస్యలపై నియోజకవర్గ ఇంచార్జీలు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈనెల 16న బీఆర్‌ఎస్ పార్టీ నిరసన ధర్నాలను నిర్వహించింది. భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకోవడానికి ఆ పార్టీ త్వరలోనే సమావేశం కానున్నట్లు తెలిసింది. భారతీయ జనతా పార్టీ ఇప్పటికే ఒక ఆందోళన కార్యక్రమానికి పిలుపు నిచ్చింది. ఈ నెల 18, 19తేదీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రైతులను కలిసి వారి సమస్యలు తెలుసుకునే కార్యక్రమాన్ని చేపట్టింది. 20న తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల్లో వినతిపత్రాలను ఇవ్వాలని, 21న అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన దీక్షలు చేపట్టాలని పార్టీ పిలుపునిచ్చింది. బీఆర్‌ఎస్ పార్టీ ధాన్యం కొనుగోలుపై దృష్టిసారించి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నది. అలాగే రెండు లక్షల రూపాయల రుణ మాఫీ, తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ధర్నాలు నిర్వహించడంతో పాటు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలను సమర్పించింది. ఆ విషయాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి రైతుల్లో తమ పూర్వ స్థానాన్ని సుస్థిరపరుచుకోవాలని భావిస్తూ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టింది. ఇతర అంశాలను కూడా ఆ పార్టీ పరిశీలిస్తూ నిత్యం ప్రజల్లో ఉండే విధంగా కార్యాచరణను సిద్ధ ంచేసుకుంటున్నది. ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తూ స్థానిక సంస్థల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని ఓటు బ్యాంకు చెక్కుచెదరకుండా చూసుకోవాలని భావి స్తున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. బీజేపీ పార్ల మెంట్ ఎన్నికల సమయం లోనే వివిధ గ్రామాల్లో ఆయా గ్రామాలకు కేంద్రం ద్వారా విడుదలైన నిధుల వివరాలను, చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వివరాలను తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. ఇప్పు డు ఆ వివరా లను కరపత్రాలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా బలంగా ప్రజల్లోకి తీసుకవెళ్లాలని భావిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో ఊహకందని విధంగా ప్రజల్లో లభించిన స్పందనను తగ్గకుండా చూసుకొని స్థానిక ఎన్నికల్లో లబ్ధిపొందాలని ఆ పార్టీ నాయకత్వం భావిస్తూ కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి కసరత్తు ప్రారంభించిందని సమాచారం.

పథకాలపై అధికార పార్టీ ప్రచారం

బీఆర్‌ఎస్, బీజేపీ కార్యక్రమాలను పరిశీలిస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీ తమ పథకాల అమలు ద్వారానే ప్రజలకు దగ్గరై విపక్షాలకు కౌంటర్ ఇవ్వాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. రెండు లక్షల రుణమాఫీని చేయడానికి ప్రత్యేక రైతు సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఒకేసారి రుణమాఫీ అమలు చేయాలని ఆ పార్టీ భావిస్తున్నది. ధాన్యం కొనుగోళ్లు, వానాకాలం పంట విధానంపై కేబినెట్‌లో చర్చించి చర్యలు తీసుకునేం దుకు సిద్ధమైంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం ద్వారా ప్రజల్లో శాశ్వతంగా తిష్టవేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించి విపక్షాలను మట్టికరిపించాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యేలు ఉన్న చోట ఇప్పటికే స్థానిక ఎన్నికలకు కసరత్తు ప్రారంభించారని, ఇతర నియోజకవర్గాల్లో ఇంచార్జీలకు ప్రణాళికను వివరించి రంగంలోకి దింపుతారని చెబుతున్నారు.

పంచాయతీలు, పరిషత్‌ల ఎన్నికలపై చర్చ

మొత్తానికి అన్ని రాజకీయ పక్షాలు స్థానిక సంస్థలకు సన్నద్ధమవు తుంటే అసలు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయని ప్రజల్లో చర్చ ప్రారంభమైంది. 2019 జనవరిలో గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా 2024 జనవరిలోగానే మళ్లీ ఎన్నికలు జరుపాల్సి ఉండే. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటం, వెంటనే గ్రామపంచాయతీల ఎన్నికలకు పోకుండా స్పెషల్ అధికారులను నియమించారు. ప్రస్తుతం జూన్‌లోగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేసి జూలైలో నోటిఫికేషన్ ఇస్తారని ఆగస్టులో ఎన్నికలు నిర్వహిస్తారని భావిస్తున్నారు. 2019 జూలై 4న మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు కొలువుతీరాయి. 2024 జూలై 3 వరకు వీటి పదవీకాలం ముగిసి, జూలై 4న కొత్త పాలకవర్గాలు ఏర్పాటు కావలసి ఉన్నది. అయితే గ్రామపంచా యతీ ఎన్నికలే పూర్తయ్యే అవకాశం లేనందువల్ల ప్రత్యేకాధికారుల పాలనలో ఇవి కొద్దిమాసాలు కొనసాగనున్నాయి. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో ప్రాదేశిక ఎన్నికలు పూర్తవుతాయని, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు కొలువుతీరుతాయని అంచనా వేస్తున్నారు. 2024 సంవత్సరం మొత్తం ఎన్నికల సంవత్సరంగా మిగిలిపోనున్నది.

గ్రూప్-1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి
- వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష

కరీంనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జూన్ 9న జరగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని టీఎస్ పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఆదేశించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లపై శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు సీపీలు, ఎస్పీలు డీసీపీలతో హైదరాబాద్ నుంచి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీసీపీ లా అండ్ ఆర్డర్ లక్ష్మీనారాయణ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా కలెక్టర్లు, ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అన్ని వసతులు కల్పించాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. కలెక్టర్లు పోలీస్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆయా పరీక్ష కేంద్రం లో తగిన బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓఎంఆర్ షీ ట్లు, ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్ హెడ్‌క్వార్టర్లలో తగిన బందో బస్తు మధ్య ఉంచాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు వాటిని జాగ్రత్తగా తీసుకెళ్లాలని, పరీక్ష కంటే ముందు ఇన్ టైంలో చేరేలా చూడాలని సూచించారు. జూన్ 9న 10:30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిం చాలని సూచించారు. పరీక్షలకు సంబంధించి ఎలాంటి మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు.

గ్రూప్-1 పరీక్షపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గ్రూప్-1 పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమీక్ష నిర్వహించారు. కరీంనగర్‌లో గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్‌కు 36 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 18,663 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పోలీస్ సిబ్బంది అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని పేర్కొన్నారు. జూన్ 9న 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని, 10 గంటలకు పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. టీఎస్పీఎస్సీ నిబంధనలకు అనుగుణంగా పరీక్ష జరిగేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌ఓ పవన్ కుమార్, డీసీపీ లా అండ్ ఆర్డర్ లక్ష్మీనారాయణ, జగిత్యాల జెఎన్టీయూ కళాశాల ప్రొఫెసర్ బీ సతీష్ కుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సృజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ స్థానంలో టీజీ

- తక్షణమే అమలు
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): టీఎస్ స్థానంలో టీజీ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో దీంతో జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వు లను అమలు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదే శించారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర అబ్రివియేషన్ సూచించే టీఎస్ స్థానంలో టీజీని వినియోగిం చేందుకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిన దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొ న్నారు. జిల్లాలో ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాల యా లు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, కార్పొ రేషన్లు, వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం.. ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్‌ను టీఎస్ బదులుగా టీజీని వాడాలని కలెక్టర్ కోరారు. లెటర్‌హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్‌సైట్లు, ఆన్లైన్ ప్లాట్ ఫార్మ్, పాలసీ పేపర్లు, జీవోలు, ఇతర అధికారిక కమ్యూని కేషన్లన్నింటిపై టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని పేర్కొన్నారు. శాఖలు ద్వారా భవి ష్యత్తులో నిర్వ హించే ఉత్తర, ప్రత్యుత్తరాలలో టీఎస్‌కు బదులుగా టీజీని ముద్రించాలని సూచించారు.

రైతులను నట్టేట ముంచుతున్న ప్రభుత్వం



మానకొండూర్‌లోని మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

మానకొండూర్, మే 18 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆరోపించారు. మానకొండూర్‌లోని మార్కెట్ యార్డులోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీ లించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కొ నుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోతున్నాయని అన్నారు. ఆరుగాలం కష్ట పడి పండించిన పంట కళ్లముందే తడసిపోతుంటే ధాన్యం కొనుగోలు చేయ క చోద్యం చూస్తుందన్నారు. అంతే కాకుండా కేంద్రాలలో రైతులకు సరైన సౌ కర్యాలు కల్పించకపోవడం వల్లే రైతుల పరిస్థితి దయనీయంగా మారింద న్నారు. తాలు తరుగు పేరుతో తూ కం ఎక్కువగా వేసి రైతుల నోట్లో మ ట్టి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చే శారు. బోనస్ రూ.500, రైతు భరోసా రూ.15,000, రెండు లక్షల రుణమాఫీ చేసి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి, మండల ప్రధా న కార్యదర్శులు సొన్నాకుల శ్రీనివాస్, కత్తి ప్రభాకర్, కొమురయ్య, రవి, శ్రీని వాస్ తదితరులు ఉన్నారు.

కూడళ్లు.. ప్రమాదాల లోగిళ్లు

- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- రక్షణ చర్యలు తీసుకోవాలంటున్న వాహనదారులు

హుజూరాబాద్‌రూరల్, మే 18: హుజూరాబాద్ పట్టణం నుంచి ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదా రులపై ఉన్న కూడళ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఎక్కడో ఒకచోట తరచుగా ప్రమాదాలు జరుగుతుం డటంతో క్షతగాత్రుల, మృతుల కుటుంబాలు రోడ్డున పడి చిన్నాభిన్నమవుతున్నాయి.

ప్రాణం తీస్తున్న మూల మలుపులు

హుజూరాబాద్ మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. కనుకులగిద్దె, జూపాక, ధర్మరాజుపల్లి, రంగాపూర్, రాంపూర్, సిర్సపల్లి, వెంకట్రావ్ పల్లె తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంబండి మూల మలుపుల వద్ద పిచ్చి చెట్లు ఏపు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదకరంగా మారాయి. అధికార యంత్రాంగం మూల మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో ఎదురుగా వస్తున్న వాహ నాలు కానరాక వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా కూడళ్లు

హుజూరాబాద్ పట్టణం నుంచి జమ్మికుంట పట్టణానికి వెళ్లే దారిలో ఉన్న రంగాపూర్, రాంపూర్, చెల్పూర్, శాలపల్లి ఇందిరానగర్, ఇటు కరీంనగర్ జిల్లాకు వెళ్తున్న దారిలో తుమ్మన్నపల్లి, సింగాపూర్, ఎరుకుల గూడెం చౌరస్తా, ఇటు చిన్నపాపయ్యపల్లి, పెంచికల్‌పేట చౌరస్తా వరకు, పెద్దపాపయ్యపల్లి గ్రామ ఎంచాయతీ పరిధిలోని కేసీ క్యాంపు చౌరస్తా, కందుగుల, ధర్మరాజుపల్లి చౌరస్తాల వరకు యూ టర్న్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. చౌరస్తాల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో పెద్ద వాహనాలను ద్విచక్ర వాహనదారులు ఢీకొని ప్రమా దాల బారినపడ్డారు. జమ్మికుంట రోడ్‌లోని రంగాపూర్, చెల్పూర్, శాలపల్లి- ఇందిరానగర్ గ్రామాల్లోని యూటర్న్‌ల వద్ద ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించక రోడ్డుపైకి ఒకేసారి వస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతుండగా, రోడ్డు ఎత్తువంపుల వద్ద ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి డివైడర్లను ఢీకొని మృత్యువాత పడుతున్నారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ప్రమాదకరమైన కూడళ్ల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



హుజూరాబాద్ మండలం శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో ప్రమాదకరంగా కూడలి



పర్కాల్ క్రాస్ రోడ్డు వద్ద అత్యంత ప్రమాదకరంగా ఉన్న కూడలి

మూల మలుపులతో ఇబ్బందులు పడుతున్నాం



-మొలుగు శ్రీనివాస్, కనుకులగిద్దె

మా గ్రామం నుంచి పట్టణానికి రావాలంటే సుమారు పదికి పైగా మూల మలుపులు ఉన్నాయి. ఈ మూల మలుపుల వద్ద పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి మూల మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోవడంతో వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టుకుంటున్నాయి.

ఎత్తువంపుల రోడ్డుతో బండ్లు అదుపు తప్పుతున్నాయి



-గోసికొండ మృత్యుంజయ్, రాంపూర్

హుజూరాబాద్ పట్టణానికి వచ్చే సమయంలో హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారి అక్కడక్కడ ఎత్తువంపులు ఉండటంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. గత నెలలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలి.

చెట్టు పైనుంచి పడి జీపీ కార్మికుడికి గాయాలు

కరీంనగర్ రూరల్, మే 18: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో చెట్టు పైనుంచి పడి పంచాయతీ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం విద్యుత్ తీగెలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగిస్తుండగా పంచాయతీ కార్మికుడు ర్యాకం శంకర్ చెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే శంకర్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

30 నుంచి పెద్ద హనుమాన్ జయంత్యుత్సవాలు

● ఇంకా ఏర్పాటు కాని సమన్వయ సమావేశం

మల్యాల, మే 18: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు జరుగనుండగా అందుకు తగిన ఏర్పాట్లకు ప్రతి ఏటా నిర్వహించే సమన్వయ సమావేశం ఇంత వరకు నిర్వహించలేదు. దీంతో జయంతి ఏర్పాట్లపై ఎవరికి వారే అన్న తీరుగా మారుతుంది. ప్రతి ఏటా జయంత్యుత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు కొండగట్టు వస్తుంటారు. దీనికి పదిహేను రోజులకు ముందుగానే ఎమ్మెల్యే, కలెక్టర్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులతో ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై చర్చించి తగు చర్యలు చేపట్టడానికి సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తుంటారు. అయితే పెద్ద జయంతి వేడుకలకు మరో పది రోజుల గడువు మాత్రమే ఉంది. ఆలయానికి రంగులు వేసే పనులు మాత్రమే చేపట్టగా సమన్వయ సమావేశానికి ఏర్పాట్లు చేయలేదు. ఉత్సవాల సందర్భంగా పోలీసు, పంచాయతీ, రెవెన్యూ, మిషన్ భగీరథ, ఆర్టీసీ, ఫైర్, నీటి పారుదల శాఖ తదితర శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించనుండగా ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి కేటాయించిన పనులలో ఇది వరకే నిమగ్నం కావాల్సి ఉంది. గత చిన్న జయంతి ఏర్పాట్లే ఇప్పుడు కొనసాగించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నప్పటికీ ఉత్సవాల సందర్భాలలో ప్రతి ఏటా భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థులతో వీసీ సంకశాల మల్లేశ్

వేములవాడ టౌన్, మే 18 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి సంకశాల మల్లేశ్ విద్యార్థులకు సూచించారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన బంగారు పతకాల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నిరంతరం సాధన చేస్తే తప్పక లక్ష్యాలని సాధించవచ్చన్నారు.ప్రతి విద్యార్థి రోజుకు కనీసం ఐద నుండి ఆరు గంటలు సాధన చేస్తే లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. నేటి యువత టీవి, సెల్‌ఫోన్, సినిమా వంటి మాధ్యమాలకి బానిసలు కావడం బాధాకరమని, వాటిని విద్యార్థులు కేవలం తమ విద్య విజ్ఞానం, వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడానికి మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. రానున్న పీజీ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ పోటీ పరీక్షలలో విజయం సాధించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుని దానికనుగుణంగా సన్నద్ధం కావాలని సూచించారు. 2020-23 సంవత్సరానికి గాను అకాడమిక్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పున్నశాస్త్రి, సనా, అరుణ్, మేహ, నందిని, రేవతి, రిషీంద్ర, కేజీయా, రజిత, సౌజన్య, సౌమ్య, భార్గవి, రాజు, రఘు, అజయ్, అనిల్‌లకు బంగారు పతకాలను అందజేశారు. ఈ సమావేశంలో టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కదారి సురేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ మధురాజేశ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వి. రాధాకృష్ణమాచార్యులు, కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, పరుశురాములు, జయవర్ధన్ జగన్నాథచార్యులు తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

కోనరావుపేట, మే 18 : కోనరావుపేట మండలం మల్కపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు గెంటె రాములు (102) శనివారం మృతి చెందాడు. రాములు ఆరోగ్యంగా ఉంటూ తన పని తాను చేసుకునేవాడు. వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. రామయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

నాచుపల్లి జేఎన్‌టీయూకు ఐఎస్‌వో గుర్తింపు

కొడిమ్యాల, మే 18: కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్‌టీయూ యుసీఈజే(అటానమస్)ఇంజనీరింగ్ కళాశాలకు ఐఎస్‌వో (ఇంటర్ నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్)గుర్తింపు లభించింది. హైదరాబాద్ జేఎన్‌టీయూ కార్యాలయంలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్ హైదరాబాదు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డా.. కె. వెంకటేశ్వర్‌రావు సమక్షంలో సర్టిఫికెట్‌ను అందించారు. ఈ నెల 15న హెచ్‌వైఎం ఇంటర్‌నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు జేఎన్‌టీయూ కళాశాలను సందర్శించి సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 2027 వరకు గుర్తింపు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.. టి. వేణుగోపాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

పురుగులమందు తాగిన యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, మే 18 : మద్యం మత్తులో పురుగుల మందు తాగిన మంద నరేష్(38) అనే యువకుడు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన నరేష్ మద్యానికి బానిసగా మారటంతో అతని భార్య పుట్టింటికి వెళ్లి కాపురానికి రావటంలేదు. దీంతో మనస్తాపం చెందిన నరేష్ ఈ నెల 4న మద్యంలో పురుగుల మందు కలిపి తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు డబ్బాతో యువకుడి ఆత్మహత్యాయత్నం



బాధితుడితో మాట్లాడుతున్న పోలీసులు

చందుర్తి, మే 18: ఆరు నెలలుగా పోలీసులు వేధిస్తున్నారంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎన్గల్ గ్రామానికి చెందిన మ్యాకల జలేందర్ అనే యువకుడు శనివారం పురుగుల మందు డబ్బాతో వచ్చి ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన మ్యాకల జలేందర్‌కు అదే గ్రామానికి చెందిన మల్లేశంకు ఆరు నెలలుగా ఇళ్ల స్థలాల సరిహద్దు వివాదం కొనసాగుతోంది. జలేందర్‌ను పలుమార్లు పోలీస్ స్టేషన్‌కు పిలిచి కేసు నమోదు చేస్తామంటూ పోలీసులు వేధిస్తున్నారంటూ ఏప్రిల్ 8న ఎస్పీని కలిశాడు. విచారణ చేపట్టాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లును ఎస్పీ ఆదేశించారు. విచారణ చేపట్టిన సీఐ ఎవరి హద్దుల్లో వారే ఉండాలన్నారు. మల్లేశం వెళ్లి ఫిర్యాదు చేయడంతో పిలిపించి ఇబ్బందులు పెడుతున్నారని, తాను ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జలేందర్ వాపోయాడు. శనివారం నిర్మాణం కోసం వివాదంలో ఉన్న స్థలంలో మల్లేశం ఇసుక పోయించాడు. దీంతో జలేందర్ తన తల్లి ఎల్లవ్వతో, చెల్లె పావనితో కలిసి పురుగుల మందు డబ్బాను వెంట తీసుకుని ఠాణాకు వెళ్లాడు. ఆత్మహత్యకు యత్నించగా అనుమానం వచ్చి అక్కడే ఉన్న హెడ్‌కానిస్టేబుల్ రంగస్వామి అడ్డుకున్నారు. అనంతరం చందుర్తి సీఐ హామీతో బాధితుడి కుటుంబ సభ్యులు వెనుదిరిగారు. ఈ విషయమై చందుర్తి ఎస్ఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా తాను జలేందర్‌ను స్టేషన్‌కు పిలిపించలేదని గంగాధర్ అనే వ్యక్తి ఠాణాకు వచ్చి పురుగుల మందు డబ్బాతో బెదిరించాడని వివరించారు.

'ఎప్‌సెట్'-24లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ఘన విజయం

కరీంనగర్ టౌన్, మే 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎప్‌సెట్) ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలతో ఘన విజయం సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్త ంచేశారు. శనివారం ఎప్‌సెట్‌లో అద్భుత ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యార్థులు వి.హాసిని 114వ ర్యాంకు, ఎన్.హేమంత్ 157, జి.శ్రీహాస్ 166, కె.సుప్రియ 296, ఎన్.జ్ఞానద 480, వి.శ్రీముఖి 568, ఎం.వర్షిత్ 575, జి.సాయిమంజునాథ్‌రెడ్డి 610, పి.జ్యోతిర్మయిరెడ్డి 863, శ్రీవెన్నెల 876, తేజస్విని 942, ఏ.శివవరుణ్ 973, సిహెచ్.అనూహ్య 950, పి.శ్రీనాథ్ 986, మలిహాఫాతిమా 992వ ర్యాంకు సాధించారని అన్నారు. 16 మంది విద్యార్థులు 1,000లోపు ర్యాంకు సాధించడం విశేషమని అన్నారు. 29 మంది విద్యార్థులు 2వేలలోపు, 63 మంది విద్యార్థులు 3వేలలోపు, 116 మంది విద్యార్థులు 5వేలలోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిప్రతిష్ఠలను నిలబెట్టారని అన్నారు. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక అత్యుద్భుత ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమని ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. ఇటీవల ప్రకటించిన ఐఐటీ మెయిన్ ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ విద్యార్థులు. 450 మంది ఐఐటీ అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. ఎప్‌సెట్-24 ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఆల్ఫోర్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

'ఎప్‌సెట్'-24 ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థుల జయకేతనం

కరీంనగర్ టౌన్, మే 18: ఎప్‌సెట్-24 ఫలితాల్లో ట్రినిటీ జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలతో విజయకేతనం ఎగురవేశారు. శనివారం రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను స్థానిక ట్రినిటీ కళాశాలలో ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ట్రినిటీలో విద్యనభ్యసించిన హానికర్ అత్యుత్తమ ర్యాంకు 44 సాధించారని అన్నారు. అలాగే వివిధ విభాగాల్లో పి.ప్రణయ్ 773వ ర్యాంకు, వై.అశ్లేష 1254, వి.శ్రీతేజ 1255, వై.అశ్విత 1551, సిహెచ్.విగ్నేష్ 1624, ఆయేషా మహజబీన్ 1627, ఫిల్జాఅతిక్ 1748, ఎస్.శ్రీలక్ష్మి 2159, ఎం.హర్షవర్ధన్ 2280, ఎన్.గంగశ్రీ 2372, పి.శ్రీదీప 2682, సిహెచ్.రంజిత 2815, మబిహా ఫాతిమా 2913 ర్యాంకులు సాధించారని అన్నారు. అలాగే ఎం.అశీష్ 2954, కె.రాణి 2996, వి.నాగజ్యోతి 3059, ఎ.అర్షిత 3266, పి.స్మరణి 3502, అంశారా సహర్ష్ 3877, అతిఫా ఫాతిమా 4012, ఎల్.ప్రతిమ 4101, బుస్రా బమాన్ 4255, బి.వైష్ణవి 4302, జి.దివ్య 4422, పి.హంసిని 4609, జె.కీర్తన 5041, ఎన్.దేవిక కృష్ణన్ 5050, బి.శుతి 5060, కె.అర్చన 5225, పి.జ్యోతిప్రకాశ్ 5267, సిహెచ్.సాయి మోహిత్‌రెడ్డి 5343, కె.సాయి ప్రద్యుమ్న ఆచార్య 6288, జె.హేమశ్రీ 6655, ఎల్.గణేశ్ 6729, సిహెచ్.జాన్ 7578, ఆర్.లక్ష్మిప్రసన్న 7675, రతన్‌కుమార్ 7757 పి.దుర్గాభవాని 8016, ఎ.సాహిత్య 8273, కె.శశాంక్ 8329, ఎ.వైష్ణవి 8415, డి.అలేఖ్య 8473, బి.కార్తీక్ 8580, పి.వినయ్ 9342, కె.శరణ్య 9591, ఎన్.స్నేహిత 9757 ర్యాంకులు సాధించారని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల ఫౌండర్ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి

ధాన్యం కొనాలని రాస్తారోకో

బీర్‌పూర్, మే 18: కొనుగోలు కేంద్రాలలో కుప్పలు కుప్పలుగా పేరుకు పోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో చేపట్టారు. బీర్‌పూర్ మండలంలోని కందెనకుంట సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని నర్సింహులపల్లి, కందెనకుంటకు చెందిన రైతులు నర్సింహులపల్లి శ్రీకృష్ణ యాదవ సంఘం సమీపంలో ప్రధాన రహదారిపె బైఠాయించి సుమారుగా గంటపాటు రాస్తారోకో చేశారు. రైతుల రాస్తా రోకో కారణంగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. ఈ సందర్భంగా రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యంలో కోతలు విధించకుండా చూడాలని, అంతే కాకుండా అన్ని రకాల ధాన్యానికి 500 రూపాయలు బోనస్ చెల్లించి నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి శీలం రమేష్, నాయకులు మెరుగు రాజేశం, శీలం రవిందర్, సుశీన్, తాడుక మల్లేశం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు


దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా చందనోత్సవం

- ఆరో రోజు ప్రత్యేక పూజలు
- పెద్ద సంఖ్యలో భక్తుల రాక

ధర్మపురి, మే 18: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం చందనోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 13 నుంచి ప్రారంభమైన నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసపూర్వక, షోడశ ఉపచార పూజ, సహస్ర నామార్చన నిర్వహించారు. పంచోప నిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్త హారతులు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. యోగ, ఉగ్ర నారసింహులను అందంగా చందనంతో అలంకరించారు. అలాగే లోక కల్యాణార్థం నిత్యం సుదర్శన, నారసింహ, రుద్ర హోమాలు నిర్వహించారు. గోదావరిలో స్నానాలు చేసిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


సమ్మయ్య(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మే 18: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని శనివారం వెనుక నుంచి ఓ వాహనం అతివేగంగా వచ్చి వేగంగా ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్పూర్ గ్రామానికి చెందిన మండల సమ్మయ్య(55) తన పనుల నిమిత్తం సైకిల్‌పై ఇందిరానగర్‌కు వెళ్లాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి సైకిల్‌పై వస్తున్న క్రమంలో జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు వస్తున్న వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన యువతిపై కేసు

తిమ్మాపూర్(మానకొండూర్) మే 18: ప్రేమ పేరుతో డబ్బులు దండుకొని ఆస్ట్రేలియాకు వెళ్లిన ఓ యువతిపై ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,, తిమ్మాపూర్‌కు చెందిన మాదన నాగరాజు అనే యువకుడు యోగా నిమిత్తం ఈశా ఫౌండేషన్‌కు వెళ్లాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంకు చెందిన కమల సంధ్య ప్రియాంకతో నాగరాజుకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. కొద్ది నెలల క్రితం వీరిద్దరు తిమ్మాపూర్‌కు రాగా నాగరాజు తండ్రి మల్లయ్య ఇంట్లోకి రానివ్వలేదు. దీంతో అదే గ్రామంలోని ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నారు.. కాగా నాగరాజు ఓ ఆసుపత్రిలో తన పేరున ఉన్న భాగస్వామ్యంను రద్దు చేసుకోవడంతో రూ. 16లక్షలు వచ్చినట్లు తెలిపారు. ఆ మొత్తాన్ని ప్రియాంక తన బంధువుల అకౌంట్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నది. అనంతరం ఆస్ట్రేలియాకు వెళ్లి మూడు లక్షలతో పాటు నాగరాజు వాటా ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో తన కుమారుడు తనను భూమి కోసం తండ్రిని వేధిస్తున్నట్లు తెలిపారు. కొంత కాలానికి ప్రియురాలు మోసం చేసిందని తీవ్ర మనస్తాపానికి గురై ఫినాయిల్ తాగి ఆసుపత్రిలో చికిత్స పొందున్నతున్నాడు. నాగరాజు తండ్రి మల్లయ్య పిర్యాదు మేరకు కమల సంధ్య ప్రయాంకపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 18: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన తేజస్వినికి అనే యువతికి తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మాపూర్‌కు చెందిన యువకుడు తేజ తన తల్లి కరికె వనిత, సోదరి తేజస్వినితో కలిసి బైక్‌పై మండల కేంద్రం మీదుగా వెళ్తున్నాడు. నారాయణపూర్‌కు చెందిన యువకుడు ఇర్ఫాన్ తన జీపుతో బైక్‌ను ఢీకొట్టాడు. ఘటనలో తేజస్వినికి తీవ్ర గాయాలవగా తేజ, వనిత స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తేజస్విని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే 18: మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. శనివారం ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పురోహితుడు వామన చక్రపాణి ఆధ్వర్యంలో పురోహితులు వేదమంత్రోచ్చారణలతో భాజా భజంత్రీల మధ్య అంగరంగ వైభ వంగా కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు, కృష్ణారావులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జెట్టి లింగం, నాయకులు కొమ్ముల రాజేశ్వర్‌రెడ్డి, మామాడి నారాయణరెడ్డి, గోరుమం తుల ప్రవీణ్ కుమార్, కల్లెడ గంగాధర్, ఏలేటి వినోద్, చిలువేరి నరేందర్, రాజేందర్, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


వేంపేటలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కథలాపూర్, మే 18 : మండలంలోని దుంపెటలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారల కల్యాణం అర్చకులు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు కావడంతో పంచామృత అభిషేకాలు, పుష్పార్చన, మంగళహారతి, మంత్ర పుష్పం, విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు నారంభట్ల వామనశర్మ, హరిప్రసాద్‌శర్మ, గిరధర్ శర్మ, భరద్వాజ్, రాజుశర్మ నేతృత్వంలో కల్యాణం కమనీయంగా జరిగింది. విశ్వక్సేన ఆరాధన, మహా గణపతి పూజ, పుణ్యహవచనం, గౌరీపూజ, అంకురారోపణ, ఎదురుకోలు, గరుడ వాహన పూజ, విశేష హవనాలు వంటి కార్యక్రమాలు జరిపారు. కళ్యాణం వీక్షించేందుకు చుట్టు పక్కన గ్రామాల నుంచి మహిళలు తర లివచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, మే 18: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించు కున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఎండ తీవ్రతతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వందలాదిగా భక్తులు స్వామి వారి సన్నిధిలో హనుమాన్ దీక్ష తీసుకున్నారు. భక్తులకు కావల్సిన ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవే క్షించారు. గదుల కొరతతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురి అయ్యారు. రా త్రులు ఆరుబయటనే నిద్రించారు.


కొండగట్టులో భక్తుల సందడి

నూతన చట్టాలపై అవగాహన కల్పించాలి

- డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వెంకటేశ్వర్లు

కరీంనగర్ లీగల్, మే 18: కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన మార్పులు, చేర్పులతో ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వింజమూరి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్త అడిషనల్, అ సిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వింజమూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతీ మొదటి శనివారం పోలీస్ అధికారుల సమీక్షా సమావేశంలో వారికి నూతన చట్టాలపై అవగాహన కల్పించాలని, ప్రతి మూడో శనివారం ప్రాసిక్యూటర్ల సమావేశంలో కూడా వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాసిక్యూటర్లు కేసుల విచారణ సమయంలో ఆయా కేసుల పూర్తి అవగాహనతో ఉండాలని, సంబంధిత న్యాయమూర్తులతో సమన్వయంతో కలిసి వెళ్లాలని అన్నారు. అనంతరం కరీంనగర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరస్వామి నూతన చట్టాలను వివరించారు. సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జ్యోతిరెడ్డి, నర్సింగారావు, తుమికి పవన్‌కుమార్, జూలూరు శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, శరత్, పెంట శ్రీనివాస్, కాసారం మల్లేశం, జంగిలి మల్లికార్జున్, సీనియర్ ఏపీపీ మురళీధర్‌రావు, వసంత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మందమర్రిటౌన్, మే 18: పట్టణంలోని రాష్ట్రీయ రహదారి జీఎం కార్యాలయం వెళ్లే రోడ్డు వద్ద శనివారం రాత్రి వాహనం ఢీకొని కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని వావిలాల గ్రామానికి చెందిన కుంబం రాధమ్మ (60) అక్కడికక్కడే మృతిచెందింది. రాధమ్మ మందమర్రిలోని కూతురును చూసేందుకు జమ్మికుంట నుంచి మందమర్రికి వచ్చింది. మందమర్రిలో బస్సు దిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా బెల్లంపల్లి వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న ఓ వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుం బీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెస్టారెంట్, టిఫిన్ సెంటర్లపై సివిల్ సప్లై అధికారుల దాడులు


డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

కరీంనగర్ మే 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ పట్టణంలో పలు హోటల్స్, టిఫిన్ సెంటర్ల, రెస్టారెంట్‌ల్లో శనివారం సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్‌లలో అక్రమంగా వినియోగిస్తున్న డొమెస్టిక్ (గృహవసరాల) సిలిండర్లను వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. సిలిండర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ప్రభుత్వం గృహలక్ష్మీ పథకంలో భాగంగా 500రూపాయలకే లబ్ధిదారులకు సిలిండ్‌లను అందజేస్తోంది. గృహ అవసరాలకు అందించే సిలిండర్ ధర 1000రూపాయలు ఉండగా అందులో కొన్ని గృహలక్ష్మీ పథకం కింద 500రూపాయలకే అందిస్తోంది. కమర్షియల్ సిలిండర్ 2,300 రూపాయలకు మార్కెట్ ధర ఉంది. అయితే సిలిండ్‌లు కాస్తా పక్కదారి పట్టి హోటళ్లు, రెస్టారెంట్‌లు, టిఫిన్ సెంటర్ల నిర్వహకులు డొమెస్టిక్ సిలిండర్‌లను ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి లక్షల్లో గండిపడటమే కాకుండా పేదల కోసం ప్రవేశపెట్టిన గృహలక్ష్మీ పథకం లబ్ధిదారులకు నష్టం వాటిల్లుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్ సప్లై అధికారి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం హోటళ్లు, రెస్టారెంట్‌లు, టిఫిన్ సెంటర్లపై దాడులు నిర్వహించి 96 సిలిండర్‌లను సీజ్ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డి తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. గృహ అవసరాలకు వాడాల్సిన సిలిండర్లను కమర్షియల్‌కు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డి తెలిపారు.

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న రైతులు


మామిడిపల్లిలో అడ్డుకున్న రైతులు

కోనరావుపేట, మే 18: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని అన్నారు. కొంతమంది ఇసుకను తోడేస్తున్నారని అక్రమంగా తరలించి కూడా అమ్ముకుంటున్నారని అన్నారు. ఇసుక రీచ్‌ను మామిడిపల్లిలో బంద్ చేసి వేరే చోట ఇవ్వాలని అన్నారు. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఆర్ఐ రాజశేఖర్ చేరుకొని రైతులతో మాట్లాడి లోతుగా తీయకుండా మరోచోట ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఇసుక రీచ్‌ను నడవనిచ్చారు.

చిరుత దాడిలో దూడ మృతి

రుద్రంగి, మే 18: రుద్రంగి మండల కేంద్రంలో చిరుత దాడిలో దూడ మృతి చెందింది. మండల కేంద్రానికి ద్రానికి చెందిన చిట్టపురం గంగాధర్ ఆనే రైతు నల్లగుట్ట ప్రాంతంలోని గోరిలాల్వ దగ్గర తన పొలం వద్ద రోజు మాదిరిగానే దూడను కట్టేశాడు. ఉదయం పోలం వద్దకు వేళ్లి చూసే సరికి దూడ మృతి చెంది ఉందని, చిరుతపులి ఆనవాళ్లు ఉండడంతో రాత్రి సమయంలో చిరుత పులి దాడి చేసి దూడను చంపిందని భాదిత రైతు తెలిపాడు. నల్లగుట్ట ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

అష్ట కష్టాలు

- డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సౌకర్యాలు నిల్
- ఉండలేక తాళాలు వేసిన వెళ్తున్న లబ్ధిదారులు



పోతారం గణేశ్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

సారంగాపూర్, మే 18: అక్కడ తాగునీటి సౌకర్యం ఉండదు.. విద్యుత్ సౌకర్యం అసలే లేదు. ఇక డ్రెయినేజీ నిర్మాణం పూర్తి కాక ఇళ్ల మధ్యనే ఆ మురుగు పారుతూ ఉంటుంది. ఆఘమేఘాల మీద ఇళ్లు నిర్మించినా అంతర్గత రహదారులు మాత్రం ఇప్పటికీ దిక్కు లేదు. ఇదంతా సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామంలో గల గణేష్‌పల్లిలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిస్థితి. కనీస వసతులు లేకున్నా కొందరు తప్పని పరిస్థితుల్లో ఆ ఇళ్లలోనూ ఉంటున్నా మరి కొందరైతే తాము ఇక్కడ ఉండలేమంటూ ఊరికి దగ్గరగానే అద్దె గదుల్లో ఉంటున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాన పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామంలో గల గణేష్‌పల్లిలో 20 ఇళ్లు నిర్మించారు. వీటిని టాటరీ పద్ధతిలో గత సంవత్సరం లబ్ధిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఇళ్లు మాత్రం పంపిణీ చేశారు కానీ వాటిల్లో కనీస సౌకర్యాలు మాత్రం కల్పించలేకపోయారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసౌకర్యాల మధ్యనే లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో ప్రధాన రహదారి నుంచి తీగలు లాగి ఇళ్లలో అమర్చుకున్నారు. దీంతో గాలి వానకు తీగలు తెగిపోవడంలో కరెంట్ అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంది. తాగునీటి సౌకర్యం లేక సమీపంలో ఉన్న బోరు బావుల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మిషన్ బగీరథ నీరు వస్తున్నా అది కూడా మూడు రోజులకు ఒక సారి రావడంతో తాగు నీటికి తిప్పలు తప్పడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. మురుగు నీరు కాలువలో నిలిచి పోవిడంతో దోమల బెడద తీవ్రమైంది. దీంతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని లబ్ధి దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు నిర్మించి ఏళ్లు గడిచినా సీసీ రహదారుల నిర్మాణాలు ఇప్పటికీ లేకపోవడం గమనార్హం. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇక్కట్లు మరింత పెరుగుతాయిఇ. ఇళ్ల ముందే వర్షపు నీరు నిలవడం, డ్రెయినేజీల్లో నిరు నిండి దుర్గంధం వెదజల్లడం వంటి సమస్యలతో లబ్ధిదారులు ఉండలేకపోతున్నారు. వసతులు లేకపోవడంతో లబ్ధి దారులు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లి పోతున్నారు. నిలువ నీడ లేని కొంత మంది మాత్రం అక్కడే ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించేందుకు రూ. 25లక్షలతో విద్యుత్, మంచినీటి సదుపాయం, రహదారుల నిర్మాణంతో పాటు మరిన్ని వసతులు కల్పించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాక సమస్యలతో సహవాసం చేయల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పూర్తి చేయని డ్రెయినేజీ

కరెంట్ సౌకర్యం ఏర్పాటు చేయాలి..



కరెంట్ సౌకర్యం లేక పోవడంలో రోడ్డు నంచి తీగలు లాగి అమర్చుకున్నాం. గాలి వచ్చినప్పుడు కరెంట్ పోతుంది. దీంతో చీకట్లో ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. సౌకర్యాలు కల్పించేలా చూడాలి. - సంద్రుగుల లక్ష్మి

నీరు రావడం లేదు.



నీటి సౌకర్యం లేక చపోవడంలో సమీపంలో ఉన్న బోరు బావుల వద్దకు వెళ్తున్నాం. మిషన్ బగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. తాగు నీటికి కొరత ఉండటంతో పొదుపుగా వాడుకుంటున్నాం. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి. - రాజవ్వ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మే 18: నగరంలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా ఆదివారం ఉదయం 8:30 నుంచి 11:30 వరకు నగరంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు టౌన్ వన్,టు, ఏడీఈ లు, సాయినేని నరేందర్, సుధీర్ కుమార్ లు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపి వేయు ప్రాంతాలు భగత్‌నగర్ సబ్‌స్టేషన్ నిర్వహణ, భగత్‌నగర్, ముకరం పుర, విగ్నేశ్వర కాలనీ, వెంకటేశ్వర కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, ఎర్రగుట్టపల్లి, కట్టరాంపూర్ ఏరియా, అంబేద్కర్ స్టేడియం, కలెక్టర్ కాంప్లెక్స్ ఏరియా, బస్టాండ్ ఏరియా, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్, ఎల్ఐసీ ఆఫీస్ ఏరియా, తిర్మలా నగర్, గణేష్ నగర్, హనుమాన్ నగర్, ధోబీ వాడ, కమాన్ ప్రాంతం ఇండస్ట్రియల్ పద్మా నగర్, ఫ్రోస్టాప్ రెస్టారెంట్ ఏరియా, ఇండస్ట్రియల్ ఏరియా, ప్రగతినగర్, లారెల్ స్కూల్, సాయిబాబా టెంపుల్ ఏరియా, అల్కాపురి కాలనీ, కోతిరాంపూర్, గణేష్ నగర్ బైపాస్, హనుమాన్‌నగర్, వివేకానందనగర్, టవర్‌సర్కిల్, డాక్టర్ స్ట్రీట్ ఫీడర్, డీఎఫ్‌వో ఫీడర్, టవర్‌సర్కిల్ ఫీడర్, గంజ్ ఫీడర్, వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

గణేశ్‌నగర్, మే 18: వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. విద్యా సంవత్సరం చివరి దశకు వచ్చినా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదని అన్నారు. 2022 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు జిల్లా బీసీ సంక్షేమ శాఖలోనే 114 కోట్ల రూపాయల బకాయిలు పేరుకు పోయాయని తెలిపారు. తక్షణమే ఫీజు బకాయిలు విడుదల చేసి విద్యార్థులను, కళాశాల యాజమాన్యాలను ఆదుకోవాలని కోరారు.

కొనసాగుతున్న క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు

కరీంనగర్ కల్చరల్, మే 18: జిల్లా కేంద్రంలోని సేయింట్ మార్క్స్ చర్చి గ్రౌండ్‌లో సిఎస్‌ఐ సంఘాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగుతున్న క్రైస్తవ ఉజ్జీవ మహాసభల్లో భాగంగా శనివారం రాత్రి సభలు ఘనంగా కొనసాగాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆదరణ కల్గిన ప్రసంగీకుడు జెన్నీ క్రిస్టోఫర్ హాజరై వాక్యపరిచర్య అందించారు. ఆదివారం సాయంత్రం 6-30 గంటల నుంచి జరిగే ముగింపు సభలో పాల్గొని క్రీస్తు కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బిషప్ డాక్టర్ కె రూబెన్‌మార్క్, బిషప్ సతీమణి ప్రెసిల్లా రూబెన్‌మార్క్, పాల్ కొమ్మాలు, డాక్టర్ ఎస్ జాన్, ఆర్ ప్రసాద్, బి ప్రసాద్, ఎ మధుమోహన్, డీకన్ పింటూ, డీకన్ రోజీ, రెనాల్డ్, తిమోతీజయరాజ్, క్రిస్టోఫర్, ఇండిపెండెంట్ పాస్టర్స్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా వైకుంఠధామాలు



దుబ్బపల్లిలో నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం

కరీంనగర్ రూరల్, మే 18: గ్రామాల్లో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా వైకుంఠధామాల పేరిట నిర్మించిన శ్మశానవాటికల నిర్మాణాలు నిరుపయోగంగా మారుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైకుంఠధామాలకు నిధులు మంజూరు చేసి గ్రామాల్లో నిర్మించారు. కానీ ప్రజల్లో అవగాహన లోపం, అధికారుల నిర్లక్ష్యంతో అవి నిరుపయోగంగా మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరీంనగర్ రూరల్ మండలంలో 17 గ్రామపంచాయతీలు ఉండగా చెర్లబూత్కూర్, నగునూర్, బొమ్మకల్ గ్రామాల్లో గతంలో శ్మశానవాటికలు ఉన్నాయి. మిగతా గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథం కింద 12లక్షల 60వేల రూపాయల చొప్పున నిధులు మంజూరు కాగా ఆయా గ్రామాల్లోని వైకుంఠ ధామాల్లో విద్యుత్, నీరు వంటి సౌకర్యాల కల్పనకు అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. దుబ్బపల్లి, నల్లగుంటపల్లి, మందులపల్లి, ఎలబోతారం తదితర గ్రామాల్లో వైకుంఠధామాలు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. స్నానాల గదులు శిథిలావస్థకు చేరాయి. వాటికి తలుపులు, కిటికీలు కూడా సరిగా లేకుండా పోయాయి. అధికారులు కూడా పట్టించుకోక పోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. అయితే గ్రామాల్లో మృతి చెందిన వారికి వారి వ్యవసాయ భూమి ఉన్నట్లయితే కుటుంబ సభ్యులు అందులోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. కొందరు సంప్రదాయం పేరిట చెరువు శిఖం స్థలాలు వాగులు, ప్రభుత్వ భూముల్లో ఖననం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించి, వైకుంఠధామాలను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఎప్‌సెట్‌లో 'ఎస్సార్' విజయకేతనం

తిమ్మాపూర్(మానకొండూర్) మే 18 : రాష్ట్రంలో శనివారం విడుదలైన ఎప్‌సెట్ ఫలితాలలో ఎస్సార్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఎస్సార్ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో తుమ్మ తేజశ్వీ 161, ఎం. గణేష్, 199, కే. శ్రీనివాస్‌రెడ్డి 291, ఆర్. దీపాన్సురెడ్డి, 412, జి. రాజీవ్ 552, సాయిచంద్ర 565, మరో 12 మందికి వెయ్యి లోపు ర్యాంకులు సాధించారు. అగ్రికల్చర్ విభాగంలో మధులిక, లక్ష్మీప్రసన్న, అశ్విత, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాలల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్ మధూకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జోనల్ ఇంచార్జి నేదూరి తిరుపతి, రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగార్జునరెడ్డి, ప్రవీన్‌రెడ్డి, మారుతి, శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

మృతుడి కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం


ఫిక్స్‌డ్ బాండ్‌ను అందజేస్తున్న స్నేహితులు

హుజూరాబాద్, మే 18: పట్టణంలో మార్బుల్ షాపు నిర్వాహకుడు ఇప్పలపల్లి రవీందర్ నెల రోజుల క్రితం శాలపల్లి-ఇందిరానగర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా శనివారం స్నేహితులు రూ. 1.20లక్షల ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేటకు చెందిన రవీందర్ హుజూరాబాద్‌లో మార్బుల్ షాపు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతని స్నేహితులు రమేష్, శ్రీనివాస్, గోవర్ధన్, పరమేష్, జ్ఞానేశ్వర్, రాజారెడ్డిలు రవీందర్ భార్యకు ఫిక్స్‌డ్ బాండ్‌ను అందజేశారు.

వెలగని వీధి దీపాలు

- అలంకారప్రాయంగా సెంట్రల్‌లైటింగ్ సిస్టమ్


అలంకారప్రాయంగా ఉన్న సెంట్రల్ లైటింగ్

హుజూరాబాద్, మే 18: హుజూరాబాద్‌లో రాత్రి వేళల్లో వెలుగునిచ్చే సెంటర్ లైటింగ్ (విద్యుత్ దీపాలు) వెలగడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రూ. 2కోట్లతో హుజూరాబాద్ పట్టణంలోని జమ్మికుంట, వరంగల్, కరీంనగర్, సైదాపూర్ రోడ్‌లకు సెంటర్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో చాలా వరకు వెలగడం లేదు. దీనిపై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. నెల రోజులుగా సెంట్రల్ లైటింగ్ దీపాలు వెలగడం లేదని ప్రజలు చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొంత మంది ప్రజాప్రతినిధులు తమకు ఎందుకులే అనే విధంగా వ్యవహ రిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో కూడా విద్యుత్ దీపాలు వెలగడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సి పల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ దీపాలు వెలిగేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



కొత్తపల్లి, ఇందూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

భగత్‌నగర్/కరీంనగర్ రూరల్ మే 18: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతున్నదని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. శనివారం కొత్తపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అలాగే కరీంనగర్ రూరల్ మండలంలోని మార్కెట్ యార్డులను బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేవని, అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ఉన్నపంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ వడ్ల కొనుగోలుపై లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్, బీజేపీ నార్త్ జోన్ కిసాన్ మోర్చా అధ్యక్షుడు జోనుకూటి సుధాకర్, కోఆర్డినేటర్ కొమ్మెర రవీందర్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి వొడ్నాల కొటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● కొత్తపల్లిలో మాజీ ఎంపీపీ వాసాల రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ చేపట్టిన రైతు సమస్యలపై రణభేరి కార్యక్రమంలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. బీజేపీ నాయకులు కెంచ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర/ఇల్లందకుంట/చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతున్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. గంగాధర మండలంలోని కొండయ్యపల్లి, ఇల్లందకుంట మండల కేంద్రంలో, చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాలను బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎండిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, గంగాధర, ఇల్లందకుంట, చిగురు మామిడి బీజేపీ మండల అధ్యక్షులు కోల అశోక్, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సిరిచందనకు స్వర్ణం


పతకం అందుకుంటున్న సిరిచందన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 18: హాంకాంగ్‌లో ఈనెల 6 నుంచి 11 వరకు నిర్వహించిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన తుడి సిరిచందన స్వర్ణ పతకం సాధించింది. ఈ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన సిరిచందన 52 కిలోల విభాగంలో పలు దేశాల క్రీడాకారులతో పోటీ పడి బంగారు పతకం సాధించిందని కోచ్ మల్లేశ్ తెలిపారు. ఈ పోటీల్లో ఆమె పాల్గొనటానికి సహాయ సహకారాలు అందించిన ద్వారాకామాయి మల్టీస్పెషాలిటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వంశీకృష్ణారావు శనివారం ఆమెను ప్రత్యేక కార్యక్రమంలో అభినందిచారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏడీ రాజమహేందర్‌రెడ్డి, డాక్టర్ రాజేశ్‌రెడ్డి, డాక్టర్ వినీత్‌మోహన్, సిబ్బంది శ్రావణ్, శ్రీకాంత్, కోచ్ మల్లేశ్ పాల్గొన్నారు.

'సీపీపై బురదజల్లే యత్నం'

కరీంనగర్ క్రైం, మే 18: కరీంనగర్‌లో లాండ్, గ్రానైట్, సాండ్ మాఫియాకు చెక్ పెట్టి, భూవివాదాల్లో తలదూర్చి కబ్జాలకు పాల్పడిన అవినీతి రాజకీయ నాయకులను అరెస్టు చేస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిపై కొంతమంది అవినీతి రాజకీయ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కరీంనగర్ 49వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్, న్యాయవాది సోహన్‌సింగ్ డీజీపీ రవిగుప్తాకు శనివారం ఒక వినతిపత్రం అందజేశారు. అవినీతి, ప్రజావ్యతిరేక శక్తుల నుంచి కరీంనగర్ ప్రజలను సీపీ కాపాడుతున్నారన్నారు. భూకబ్జాలు, సామాన్యప్రజలపై దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడి న అనేకమంది అవినీతి రాజకీయ నాయకులు, రౌడీషీటర్లు, ఇతరులపై సీపీ ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. ఒక వర్గానికి చెందిన కొంతమంది అవినీతి రాజకీయ నాయకు లు వారి అక్రమదందాలు సాగకపోవటంతో కక్షతో వారి రాజకీయ పలుకుబడితో తప్పుడు అభియోగాలు చేసి, సీపీని బదిలీ చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అవినీతిపరులు, భూకబ్జాదారులను ఉక్కుపాదంతో అణచివేస్తున్న సీపీకి జిల్లా ప్రజలు మద్దతుగా ఉన్నారని డీజీపీకి ఇచ్చిన వినతిపత్రంలో వారు పేర్కొన్నారు.

'ఎప్‌సెట్'-24లో 'శ్రీచైతన్య' విద్యార్థుల సత్తా


ధనుష్‌కుమార్, మణిదీప్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, మే 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎప్‌సెట్-24 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి తెలిపారు. అభిరామ్ 206, ధనుష్ కుమార్ 566, మణిదీప్‌రెడ్డి 751 ర్యాంకులు సాధించారని చెప్పారు. అలాగే 10వేలలోపు ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ విభాగంలో 22 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం పట్ల ఆయన అభినందించారు. ఎప్‌సెట్ పరీక్ష రాసిన వారిలో 80శాతం మంది విద్యార్థులు క్వాలీఫై అయ్యారని అన్నారు. అనునిత్యం పర్యవేక్షణ, ఎప్‌సెట్ పరీక్ష నిర్వహించే వరకు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడం వల్లనే ఈ ఘన విజయం సాధించగలిగామని రమేశ్‌రెడ్డి అన్నారు. ఎప్‌సెట్‌లో సీట్లు సాధించి సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులను ఆయన అభినందిస్తూ, సంస్థ స్థాపించిన నాటి నుంచి అన్ని పోటీ పరీక్షల్లో విద్యార్థులు రాణిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. విజయ సాధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన శ్రీచైతన్య అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కాక తంటాలు

- వర్షంతో ఆందోళనలో రైతులు


కాంటాలుకాక పేరుకుపోయిన ధాన్యం

కరీంనగర్ రూరల్, మే 18: పంటలు కోసి చివరి దశకు చేరాయి. కాని కాంటాలు కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులకు వరి పంట పండించడం ఒక్క ఎత్తయితే, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడం మరోక ఎత్తవుతోంది. ఆకాల వర్షం కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గురువారం సాయంత్రం, రాత్రి వేళల్లో కురిసిన వర్షంతో పాటు, ప్రస్తుతం వాతావరణం మేఘావృతం కావడంతో పలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేయగా ధాన్యం నిలువ ఉన్న కేంద్రాల్లో కొనుగోళ్లుకాక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. రైతులు తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్ కవర్లు తొలగించి ధాన్యం ఆరబెడుతున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందంటూ కాంటా పెట్టకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోయిందని పలువురు రైతులు రోదిస్తున్నారు. ధాన్యం తేమ శాతం ఎక్కువగా ఉండటంతో జూబ్లీనగర్, దుబ్బపల్లి, చెర్లబూత్కూర్‌లో కాంటా పెట్టడం లేదని అధికారులు తెలిపారు. శనివారం కూడా నగునూర్ వరి కొనుగోలు కేంద్రంలో హమాలీలు రాకపోవడంతో కాంటాలు నిలిచిపోయాయి. హమాలీలు ఎప్పుడు వస్తారో అని చూడకుండా వారు వచ్చే లోపే బస్తాలు కూడా నింపి పెడుతున్నారు. కాంటాలు చివరి దశకు చేరడంతో పలు కేంద్రాలు మూసి వేయగా ఎక్కువగా నగునూర్, జూబ్లీనగర్, తీగలగుట్టపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసి కేంద్రాల్లో కాంటాలు నిలిచి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి కాంటాలు వేసి తమకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైభవంగా వాసవీమాత జయంతి


వాసవీమాత హోమంలో పాల్గొన్న ఆలయట్రస్టు చైర్మన్, డైరెక్టర్లు, భక్తులు

కరీంనగర్ కల్చరల్, మే 18: జిల్లాలోని పలు చోట్ల శనివారం వాసవీమాత జయంతిని ఘనంగా నిర్వహించారు. నగరంలోని అశోక్‌నగర్ వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, డైరెక్టర్ల నేతృత్వంలో పారువెల్ల ఫణిశర్మ బృందం వైదిక నిర్వహణలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అభిషేకం, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, అష్టోత్తరశత వాసవీమాత పారాయణం జరిగాయి. అనంతరం వైభవంగా అమ్మవారికి డోలోత్సవం జరిగింది. మహానైవేద్యం, తీర్థప్రసాద వితరణ అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారి రథ శోభాయాత్ర కన్నులపండువలా పుర వీధుల గుండా సాగుతూ ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి చేరుకుంది. అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. రాత్రి అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు చిట్టుమల్ల శ్రీనివాస్, కాచం రాజేశ్వర్, కోశాధికారి బొల్లం శ్రీనివాస్, సంకటహర చతుర్థి కన్వీనర్ రాచమల్ల భద్రయ్య, తాటిపెల్లి సుభాష్, నార్ల శ్రీనివాస్, తొడుపునూరి దశరథం, పెద్ది మహేశ్, కొండ శ్రీనివాస్, మంచాల గౌరీనాథం, ఎలగందుల వీరేశం, ఎరవెల్లి శంకర్, నకిరకొమ్ముల శంకర్‌లింగం, గజవాడ శ్రీనివాస్, పల్లెర్ల శ్రీనివాస్, రామిడి శ్రీనివాస్, పాత కృష్ణమూర్తి, చింత సురేశ్, పాల్తెపు శ్రీనివాస్, ఎల్లెంకి ఆంజనేయులు, రాచమల్ల ప్రసాద్, యాంసాని అశోక్, పాల్తెపు మల్లికార్జున్, జవ్వాజి కమలాకర్, పడమటింటి తిరుపతి, కొంజర్ల నారాయణ, మోటూరి ఆంజనే యులు, కట్కూరి వేంకటేష్, పడకంటి శ్రీనివాస్, చిట్టుమల్ల వేణుగోపాల్, రేణికుంట శ్రీధర్, సామ అశోక్, రాచమల్ల శ్రీనివాస్, తొడుపునూరి తిరుపతి పాల్గొన్నారు.

కరీంనగర్ కల్చరల్: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా శనివారం విద్యానగర్ ఆర్య వైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడు గజవాడ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గట్టు ఆనందం, కోశాధికారి గౌరిశెట్టి రమేశ్, అదనపు కార్యదర్శి యాంసాని సతీశ్, సహాయ కార్యదర్శి మోటూరి భూమయ్య, ముఖ్య సలహాదారుడు విశ్వనాథుల రాములు, ఉపాధ్యక్షుడు కాసం సుదర్శనం, సంయుక్త కార్యదర్శులు కాచం సురేందర్, కొమురవెల్లి కోటేశ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గజ్జెల వేంకటేశ్, నలుమాచు సంతోష్, నరహరి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలో అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో వాసవీమాత జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో వాసవిమాత జయంతి వేడుకలు చేసిన అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో రమేష్, నగేష్, శ్రీనివాస్, రాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సత్యనారాయణ, శంకర్, సతీష్, వేణు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి మాత పుట్టిన రోజు సందర్భంగా మహిళలు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మహిళలు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఒక రోజు శిక్షణ

శంకరపట్నం, మే 18: శంకరపట్నం మండలం కేశవపట్నం శ్రీబ్రహ్మ విద్యశ్రమంలో శనివారం విశ్వహిందూ పరిషత్-మాతృశక్తి ఆధ్వర్యంలో ఒకరోజు అభ్యాస వర్గ (శిక్షణ కార్యక్రమం) నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు హిందూ ధర్మ విలువలను, సత్సంగం, దేవాల యాలు, సామూహిక పూజలు, పండుగల ద్వారా హిం దూ ధర్మ ఆవశ్యకతలను ప్రజలకు తెలియజేయాలన్నారు. హిందూ ధర్మాన్ని రక్షించే యజ్ఞంలో అందరిని భాగస్వాములను చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత రామ్‌మోహన్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మశ్రీ, లక్ష్మి సరోజినీ, ఉషారాణి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీరన్న ఉత్సవాలు

హుజూరాబాద్, మే 18: పట్టణంలో బీరన్న ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం యాదవ కులస్థులు గంగ బోనం, లింగాలు తీసే కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్ ముక్క పల్లి కుమారస్వామి, ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరేణి సమ్మయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


సుందరగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం

చిగురుమామిడి, మే 18: మండలంలోని సుందరగిరిలో గుట్టపై స్వయంభూగా వెలిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం నుంచి 27 వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ నుంచి భక్తులు హాజరువుతారు. ఈ ఆలయానికి సుమారు 400 ఏళ్ల చరిత్ర ఉంది. గుట్టపై ఉన్న గుండంలో వేసవి కాలంలోనూ నీరు ఉండడం ప్రత్యేకతగా చెబుతారు. 19, 20,21 తేదీల్లో అధ్యాయన మహోత్సవం నిర్వహించనున్నారు. 22న స్వామి పులి కాపు(అభిషేకం), 23వ తేదీన ఉదయం 5గంటలకు స్వామి వారి సుప్రభాత సేవా, స్వామి వారి అరగింపు, పుణ్యాహవచనం, మృత్యుంగ్రహణం, అంకురారోహణం, రక్షబంధనం, ప్రసాది వాసాం, దేవత ఆహ్వానం, ధ్వాజ రోహణం అనంతరం స్వామి వారి ఎదురు కోళ్లు, ముత్యాల తంబ్రాలతో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. 24 నుంచి 26వ తేదీ ఉదయం వరకు నిత్యహోమం, బలిహరణం నిర్వహించనున్నారు. సాయంత్రం శకటోత్సవం చేపడుతారు. 27వ తేదీ రాత్రి 9 గంటలకు ఏకంత సేవ, సప్త వర్ణలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విదేశీ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మే 18: 2024-25 సంవత్సరానికి కరీంనగర్ జిల్లాలోని విదేశాల్లో చదివే గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఉపకార వేతనానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్ స్థాయి పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ ప్రోగ్రాం నందు చదవాలనుకునే గిరిజన విద్యార్థిని విద్యార్థులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఎంపికైన గిరిజన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులైన గిరిజన విద్యార్థిని విద్యార్థులు ఈనెల 31 లోగా https://overseas.tribal.gov.in/ వెబ్‌సైట్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, మే 18: నగరానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ దారుల్ ఖైర్ ఆధ్వర్యంలో శనివారం అంగడి ప్రాంతంలో చలివేంద్రాన్ని మతీన్ ఫ్రెండ్స్ అధ్యక్షుడు తాడ వీరారెడ్డి, నిర్వాహకుడు డాక్టర్ అబ్దుల్ ఖుద్దూస్ ప్రారంభించారు. వేసవి కాలం ముగిసే వరకు చల్లటి మినరల్ వాటర్ అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పెద్ది వేణు, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మతీన్, సభ్యులు అహ్మద్ అల్ జైదీ, నజీబ్ అహ్మద్, అబ్దుల్ వసీ, అజీమ్ ఖాన్, అబ్దుల్ అజీజ్, జమాలొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ కేసులు ఎత్తివేయాలి

కరీంనగర్ అర్బన్, మే 18: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమ సమయంలో నమోదైన కేసులను తెలంగాణ రాష్ట్ర 10వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎత్తివేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందించినట్లు టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, రైతులు, కూలీలు, ఇతర అన్నివర్గాల ప్రజలపై రాష్ట్ర పోలీసులతోపాటు రైల్వే పోలీసులు కేసులు నమోదు చేయటంతో కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతూ భవిష్యత్‌ను కోల్పోతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలపై అక్రమంగా నమోదైన కేసులను ఉపసంహరించేలా ఆదేశాలు జారీ చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ పరిశోధకులకు సోనియాగాంధీ పేరిట ఫెలోషిప్ పథకాన్ని ప్రారంభించాలని కోరారు.

'ప్రైవేట్ విద్యాసంస్థలపై నిఘా కరువు'

భగత్‌నగర్, మే 18: జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలపై అధికారుల నిఘా కరువైందని పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ అన్నారు. ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థలపై పర్యవేక్షణ కరువైందన్నారు. జిల్లా విద్యాధికారి కార్యాలయంలో జరుగుతున్న చర్యలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

భగత్‌నగర్, మే 18: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) జిల్లా కార్యదర్శి పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండు రోజుల నుంచి ప్రకృతి వైపరీత్యాల కారణంగా అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. షరతులు లేకుండా రైతులకు 500 రూపాయల బోనస్ చెల్లించాలన్నారు. మార్కెట్, కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పనులను వేగవంతం చేయాలి

గన్నేరువరం, మే 18, మండలంలోని పాఠశాలల్లో మిగిలి ఉన్న పనులను ఈ నెల ఆఖరు వరకు పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి సముద్రాల రామానుజాచారి అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామ పంచాయితి కార్యాలయంలో శనివారం ఆయన అమ్మ ఆదర్శ పాఠశాల పనుల గురించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలల పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంఈవో శ్రీనివాస్, ఏపీఎం లావణ్య, ఏఈపీఆర్ స్నేహ జ్యోతి, ప్రాధానోపాధ్యాయులు, పంచాయితి కార్యదర్శులు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ కేంద్రం ప్రారంభం

శంకరపట్నం, మే 18: శంకరపట్నం మండలంలో మహిళా శక్తి స్కీం ద్వారా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫామ్ కుట్టుమిషన్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రవీందర్, మండల సమాఖ్య సిబ్బంది, మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

చిగురుమామిడి, మే18: మండలంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల ప్రకారం మండలంలోని పీచుపల్లి, చిన్నముల్కనూర్ గ్రామాల్లోని ధాన్యాం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మండలంలోని రెండు కేంద్రాల్లో తప్ప మిగితా చోట్ల కొనుగోళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సీజన్‌లో 1,943 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో వేణు, రాములు, ప్రభాకర్‌రెడ్డి, సదానందం, శ్రీనివాస్, రాజేశ్వర్‌రెడ్డి, చంద్ర య్య, నవీన్, మధు, రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామడుగు, మే 18 : మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఏగోళ్లపు భారతమ్మ (45) అనే మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై సురేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం భారతమ్మ ఆమె భర్త మల్లేశం 20 రోజుల క్రితం మోటార్ సైకిల్‌పై వెళుతుండగా లారీ డీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బంధువులు ఆస్పత్రిలో చేర్పించారు. కాగా భారతమ్మ పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

సైదాపూర్, మే 18: మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామంలో గల వీరబ్రహ్మేంద్ర స్వామి ఆల యంలో విశ్వబ్రాహ్మణులు శనివారం ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రత్యేక పూ జలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సింగోజు శ్రీనివాస్, రవీంద్రచారి, నిరంజన్, మురళీ, సురేష్, చంద్రకళ, రాజేశ్వరి, భారతవ్వ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.